మావోయిస్టుల బంద్ నేపథ్యంలో నాకాబంది

ప్రజాశక్తి - కురుపాం

దండకారణ్య ప్రాంతంలో మావోయిస్టులు బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో మండలంలోని నీలకంఠపురం ప్రధాన రహదారి వద్ద ఎస్సై ఎ.నీలకంఠరావు ఆదివారం నాకాబంది నిర్వహించి ముమ్మరంగా వాహనాలను తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తన సిబ్బందితో కలిసి రోడ్డు మార్గంలో ప్రయాణిస్తున్న అన్ని వాహనాలను ఆపి విస్తృతంగా తనిఖీ చేశారు. బంద్ నేపథ్యంలో ప్రజా భద్రత దృష్ట్యా అదనపు జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. మావోయిస్టుల చర్యలకు లోనుకాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలు కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని స్థానికులకు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

గురజాడ రచనలు ఆదర్శనీయం

దేశభక్తి గీతాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి ● 'గురజాడ రచనలు.. ప్రాసంగికత'లో వక్తలు పిలుపు



ప్రజాశక్తి-విజయనగరంటౌన్, కోట

మహాకవి గురజాడ రచనలు, ఆశయాలు ఎప్పటికీ సమాజానికి ఆదర్శనీయమని వక్తలు తెలిపారు. ఆదివారం గురజాడ వెంకట అప్పారావు 110వ వర్ధంతి సందర్భంగా సాహితీ స్రవంతి, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురజాడ రచనలు-ప్రాసంగికత పేరిట కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా జెడ్‌పి సమావేశ మందిరంలో గురజాడ సాహితీగోష్టి కార్యక్రమాన్ని నిర్వహించి, సదస్సులు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా 'గురజాడ యుగస్వరం ఎందుకని' పుస్తకాన్ని కవులు, సాహితీవేత్తలు ఆవిష్కరించారు.

గురజాడ అప్పారావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న తెలకపల్లి రవి, కెఎస్ లక్ష్మణరావు, పి.ఎ.దేవి, సాహితీవేత్తలు, తదితరులు

చారిత్రక సంపదను కాపాడుకుందాం

చారిత్రక సంపదను కాపాడుకునే బాధ్యత మనందరిపై ఉందని ఇంటాక్ మాజీ కన్వీనర్ ఈమని రాణీశర్మ స్పష్టంచేశారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కోశాధికారి జి.మురళీధర్ అధ్యక్షతన 'ప్రముఖులు స్మారక భవనాలు, చిహ్నాలు పరిరక్షణ- ఆవశ్యకత' అంశంపై ఏర్పాటుచేసిన సదస్సులో రాణీశర్మ ప్రసంగించారు. చారిత్రక ప్రదేశాలను కాపాడుకోవ డానికి రాష్ట్రంలో ఉన్న ఏ రాజకీయ పార్టీలూ ప్రాధా న్యత ఇవ్వడం లేదన్నారు. గురజాడ నివాసానికి ప్రభుత్వాలు ఏవో చేస్తాయని చూస్తూ ఉంటే సమయం వృథా అవుతుందన్నారు. తొట్లకొండ, ఎర్రమట్టిదిబ్బలు గురించి న్యాయ పోరాటం చేయాల్సిన స్థితిలో ఉన్నామన్నారు. గురజాడ నివాసాన్ని, జ్ఞాపకాలను మనమే కాపాడుకోవాలని కోరారు. ద్రవిడ యూని వర్సిటీ పూర్వ వైస్ ఛాన్సలర్ కె.ఎస్ చలం మాట్లాడు తూ కళింగాంధ్ర దేశానికి వెన్నెముకని అభిప్రాయ పడ్డారు. అలాంటి నేలపై జన్మించిన గురజాడ సమాజంలో వైరుధ్యాలను వందేళ్ల క్రితమే వెలుగులోకి తెచ్చారన్నారు. మన ప్రాంతాల పట్ల అణచివేత నాడు నేడు కొనసాగుతుందన్నారు. గురజాడను గుండెల్లోంచి తీసేసి ప్రజల్లో పెట్టాలని కోరారు.

గురజాడ గౌరవ యాత్ర

విజయనగరంటౌన్ : గురజాడ అప్పారావు వర్థంతి సందర్భంగా నగరంలో సాహితీ స్రవంతి, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురజాడ గౌరవయాత్రను చేపట్టారు. తొలుత గురజాడ అప్పారావు జంక్షన్‌లో గురజాడ విగ్రహానికి సాహితీ స్రవంతి రాష్ట్ర గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి, ప్రముఖ సామాజికవేత్త పి.ఎ.దేవి, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు కె.ఎస్ లక్ష్మణరావు, లోకసత్తా రాష్ట్ర అధ్యక్షులు బీసెట్టి బాబ్జీ తదితరులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అక్కడ నుంచి జెడ్‌పి సమావేశ మందిరం వరకు గురజాడ గౌరవ యాత్ర చేపట్టారు. ఈ ర్యాలీని పి.ఎ.దేవి జెండా ఊపి ప్రారంభించారు. ప్రపంచానికి తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటిచెప్పిన మహా కవి గురజాడ అప్పారావు నివాసాన్ని స్మారక కేంద్రంగా తీర్చిదిద్దాలని సాహితీవేత్తలు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు, కవులు, కళాకారులు, మేధావులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గొప్ప దార్శనికుడు గురజాడ

గురజాడ గొప్ప దార్శనికుడని ప్రముఖ కవి, సాహితీ స్రవంతి రాష్ట్ర గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి కొనియాడారు. 'గురజాడ ప్రవచించిన దేశభక్తి' అనే అంశంపై సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్ అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎంతో ముందు చూపుతో గురజాడ కవితలను, నాటకాలను రచించారన్నారు. మనిషి ఆధారంగా అభివృద్ధి జరగాలని, సమానత్వం ఉండాలని, కుల, మత భావాలు, తారతమ్యాలు ఉండకూడదని చాటి చెప్పిన మహావ్యక్తి గురజాడ అన్నారు. కానీ, నేడు మతం ఆధారంగా రాజకీయ పార్టీలు ఏర్పడి పాలిస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఏ తారతమ్యాలు ఉండకూడదని గురజాడ చెప్పారో.. నేడు కుల, మత, లింగ వివక్షత చూపిస్తూ రాజకీయాలు చేస్తున్నారన్నారు. దేశమంటే మట్టి కాదోయ్ మనుషులోయ్ అన్న మాటకు తిలోదకాలిచ్చి మొత్తం భూమిని లాగేసుకుంటున్నారని చెప్పారు. గురజాడ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని, ఆయన దేశభక్తిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ గురజాడ ప్రజల కోసం ప్రజా ఉద్యమమని చెప్పారని, ప్రస్తుతం అదే మాట అంటే జైల్లో ఉండేవారన్నారు అధికారం కోసం మతాన్ని వాడుకుంటున్న దుస్థితి నెలకొందన్నారు. ప్రముఖ రచయిత గంటేడ గౌరునాయుడు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ చేస్తుంటే మనలో చలనం లేకపోవడం బాధాకరమన్నారు. గురజాడ చెప్పిన విధానంగా జ్ఞానం ఒక్కటే నిలిచిపోయే వరకు పోరాడదామని పిలుపునిచ్చారు.

తెలకపల్లి రవి

అట్టాడ అప్పలనాయుడు, గంటేడ గౌరునాయుడు

స్మార్ట్ కేంద్రంగా గురజాడ నివాసం

గురజాడ నివాసాన్ని స్మార్ట్ కేంద్రంగా తీర్చిదిద్దాలని మాజీ ఎమ్మెల్సీ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు కె.ఎస్.లక్ష్మణరావు ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్ అధ్యక్షతన 'కన్యాశుల్కం సామాజిక ప్రయోజనం' అంశంపై ఏర్పాటుచేసిన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఈ సభా స్ఫూర్తితో ప్రజలను కూడగట్టి గురజాడ రచనలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వి.లక్ష్మణ ఒడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రకరకాల పేర్లతో వేల కోట్లు ఖర్చు పెడుతోందని, ఈ సమాజం కోసం, దేశం కోసం కష్టపడిన వారిని గుర్తించడం లేదని తెలిపారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తవ్వా సురేష్ మాట్లాడుతూ గురజాడ భవనానికి స్థలం కేటాయించి స్మృతివనంగా నిర్మించాలన్నారు.

గురజాడ రచనలు నిత్య నూతనం

ప్రజాశక్తి-విజయనగరం కోట

మహాకవి గురజాడ రచనలు నిత్య నూతనమని హైకోర్టు న్యాయమూర్తి సిహెచ్ మానవేంద్రనాథ్ రాయ్ అన్నారు. గురజాడ వెంకట అప్పారావు 110వ వర్ధంతి సభను గురజాడ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యాన పివిజి రాజు కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సాహితీ వేత్త, పద్మశ్రీ కొలకలూరి ఇనాక్‌కు 25వ గురజాడ విశిష్ట పురస్కారాన్ని ఆయన ప్రదానం చేశారు. అనంతరం ఇనాక్ మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న సాంఘిక దురాచారాలను, కట్టుబాట్లను, సమాజంలోని కుళ్లు బయటకు తీయడానికి గురజాడ రచనలు ఎంతో ఉపయోగపడ్డాయన్నారు. విశ్వ మానవాళిని ప్రేమించమని ఆనాడే చెప్పిన వ్యక్తి గురజాడ అని కొనియాడారు. ఎస్‌పి ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ 120 ఏళ్ల క్రితమే సమాజ మార్పుకు ఒక సూచికగా కన్యాశుల్కాన్ని రచించారన్నారు. తన సాహిత్యం ద్వారా సమాజ మార్పుకు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ రామసుందర్‌రెడ్డి, పురస్కార ప్రదాత కోలగట్ల తమన్న శెట్టి, నవ సాహితీ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్‌వి సూర్యప్రకాశరావు, సన్స్ స్కూల్ అధినేత ఎం.అనిల్‌కుమార్, గురజాడ సాంస్కృతిక సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

గురజాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మానవేంద్రనాథ్ రాయ్

కాలజ్ఞానం కలిగిన వ్యక్తి గురజాడ

కాలజ్ఞానం కలిగిన వ్యక్తి గురజాడ అని ప్రముఖ సామాజిక వేత్త పి.ఎ.దేవి పేర్కొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు రమాగీతాదేవి అధ్యక్షతన 'గురజాడ స్త్రీ పాత్రల ఔన్నత్యం'పై నిర్వహించిన సదస్సులో పి.ఎ.దేవి ప్రసంగించారు. కన్యాశుల్కం నాటకంలో పాత్రలేవీ కల్పితాలు కాదని, భవిష్యత్తుపై ముందుచూపుతో ఆ నాటకాన్ని గురజాడ రచించారని తెలిపారు. సంఘసంస్కరణకు చేయాల్సిన పనులన్నీ ఆ నాటకంలో పాత్రల ద్వారా చూపించారని తెలిపారు. సమాచార హక్కు కమిషనర్ రెహానా మాట్లాడుతూ గురజాడ 125 ఏళ్ల క్రితమే ఆస్తి ప్రస్తావనను స్త్రీలకు అన్వయించారన్నారు.

గురజాడ విగ్రహానికి నివాళ్లు అర్పిస్తున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

ఆధునిక తెలుగు వైతాళికుడు గురజాడ : కలెక్టర్

పార్వతీపురం : తెలుగు సాహిత్యంలో నవయుగానికి నాంది పలికిన మహాకవి, యుగకర్త గురజాడ అప్పారావు అని, ఆధునిక తెలుగు వైతాళికుడని కలెక్టర్ డాక్టర్ ఎం.ప్రభాకరరెడ్డి అన్నారు. గురజాడ అప్పారావు 110వ వర్ధంతి సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని విద్యార్థినులతో గురజాడ అప్పారావు చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సఆయన మాట్లాడుతూ తెలుగు భాషలోని నిర్దిష్టమైన అక్షర స్వరూపం గురించి, దాన్ని సరళంగా, అందంగా ఉపయోగించాల్సిన ఆవశ్యకత గురించి ప్రస్తావించారన్నారు. నేడు తెలుగులో కథలు, కవితలు సరళంగా, సులభంగా అర్థమయ్యేలా ఉండటానికి గురజాడ అప్పారావే ఆద్యులని కీర్తించారు. తొలుత సబ్‌కలెక్టర్ కార్యాలయ ఆవరణలో గల గురజాడ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో జెసి సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎలుగుల మెట్టపై ఏం జరుగుతోంది?

తవ్వేస్తారేమోనని సమీప గ్రామాల ప్రజల్లో ఆందోళన

ప్రజాశక్తి - పార్వతీపురం

మండలంలోని పెదబొండ పల్లి, హెచ్.కారాడవలస సమీపంలో ఉన్న ఎలుగుల మెట్టపై ఏం జరుగుతుం దోనని సమీప గ్రామాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. గ్రానైట్ కొండ సమీపంలో విద్యుత్ సరఫరాకు లైన్ ఏర్పాటు చేస్తుండడంతో జనం గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. బడిదేవరకొండ గ్రానైట్ తవ్వకాల విషయంలో ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర కంపెనీ యజమానికి అనుకూలం గా వ్యవహరించిన తీరును దృష్టిలో పెట్టుకొని ఎలుగుల మెట్ట గురించి సమీప గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఈ కొండపై తవ్వకాలకు సంబంధించి కంపెనీ ప్రతినిధులు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా పెదబొండపల్లి, హెచ్.కారాడవలస గ్రామస్తులు తీవ్రంగా వ్యతిరేకించారు. గ్రానైట్ తవ్వకాలకు అనుమతి కోసం దరఖాస్తు చేసిన కంపెనీకి అధికారపార్టీ నాయకులు అను కూలంగా ఉండడంతో గ్రామాల ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఒకవేళ తవ్వకాలంటూ మొదలు పెడితే ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని గ్రామాల ప్రజలు భావిస్తున్నారు.



వ్యక్తిత్వ వికాస పాఠాలు 'మాటల మాధుర్యం'

ప్రజాశక్తి - పార్వతీపురం

మన్యం పుస్తక మహోత్సవంలో భాగంగా ఆదివారం ఆరోరోజు నిర్వహించిన సాహితీ కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావు రచించిన మాటల మాధుర్యం బాల కథల సంపుటి పుస్తకాన్ని పలువురు కవులు, రచయితలు ఆవిష్కరించారు. సాహితీ లహరి అధ్యక్షులు డాక్టర్ మంచుపల్లి శ్రీరాములు అధ్యక్షతన నిర్వహించిన సభలో సాలూరు పట్టణానికి చెందిన కవి, రచయిత కిలపర్తి దాలినాయుడు సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కథలన్నీ అద్భుతమైన విషయాలతో వ్యక్తిత్వ వికాస పాఠాల్లాగా ఉన్నాయని, పిల్లలు, ఉపాధ్యాయులు, తల్లి దండ్రులు తప్పక చదవాలని కోరారు. భాషా బోధనలో బాలసాహిత్యం పాత్ర చాలా ఎక్కువ ఉంటుందని, పిల్లలకు శ్రవణం, పఠనం, లేఖనం, భాషణం అలవడేలా బాల సాహిత్యం చేస్తుందని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత బెలగాం భీమేశ్వరరావు చెప్పారు . పిల్లలకు తల్లి పాలతో బాటు బాల సాహిత్యాన్ని పరిచయం చెయ్యాలని, అప్పుడే చక్కని వ్యక్తిత్వంతో ఎదిగి, భవిష్యత్తులో ఉత్తమమైన పౌరులుగా తయారవుతారని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో కవులు తుంబలి శివాజీ,బివి పట్నాయక్,గుడ్ల అమ్మాజీ,ఎంటేడ గౌరు నాయుడు పాల్గొన్నారు.

పుస్తకాలను పరిశీలిస్తున్న డిఆర్‌ఒ హేమలత

మాటల మాధుర్యం బాలల కథల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

పుస్తక మహోత్సవానికి పెరుగుతున్న ఆదరణ

మన్యం పుస్తక మహోత్సవం ఆరో రోజు నాటికి విద్యార్థులు,కవులు, రచయితలు, అధికారుల తాకిడి పెరిగింది.ఆదివారం జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత పుస్తక మహోత్సవం సందర్శించి పలు పుస్తకాలను పరిశీలించారు.ఉత్సవం వల్ల పుస్తక పఠనం పై ఆసక్తి పెరుగుతోందని పలువురు విద్యార్థులు చెపుతున్నారు.

మబ్బులతో మొదలైన అలజడి

ప్రజాశక్తి - వీరఘట్టం

దిత్వా తుపాను ప్రభావంతో వాతావరణంలో ఒక్కసారి పెను మార్పులు రావడంతో అన్నదాతల్లో అలజడి మొదలైంది. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రతంగా ఉండి ఒక్కసారి మబ్బులు ఏర్పడడంతో ఆరుగాలం కష్టించి పండించిన పంట నాశనం కాకుండా ఉండేందుకు అవకాశం లేనివారు పంట పొలాల్లోనే కుప్పలు వేసుకున్నారు. అవకాశం ఉన్నవారు నాటుబళ్ళతో కళ్లాలకు పంటను తీసుకువచ్చి కుప్పలు వేసి వాటిపై టార్పాన్లు కప్పుతున్నారు. మండలంలో ఇంతవరకు 40శాతం కోతలు కోయడంతో 60 శాతం ఇంకా పొలాల్లోనే వరి చేలు దర్శనమిస్తున్నాయి. నవంబర్ మొదటివారంలో ఏర్పడిన తుఫానుకు మండలానికి ఎటువంటి ప్రమాదం లేకపోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్న తరుణంలో మరోసారి తుఫాను వార్త వినడంతో మరింత గుబులుచెందాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అన్నదాతల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏడాదిగా పెట్టుబడులు అధికంగా ఉన్నప్పటికీ వరుస తుపానుల కారణంగా ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు ఉన్నారు.

కుప్పలు వేస్తున్న రైతులు

మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటీకరించొద్దు

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు

ప్రజాశక్తి - కురుపాం

రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని స్మార్ట్ కిచెన్ పేరుతో ప్రైవేటీకరించాలనే ప్రయత్నాలు మానుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు అన్నారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద మధ్యాహ్న భోజన కార్మికులు, పాఠశాలల సీపర్ల తో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయను మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో గత 22 ఏళ్లుగా విజయవంతంగా నడుస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి అప్పగించాలనుకోవడం పెద్ద ప్రమాదమన్నారు. మండలంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఉన్న వంట విధానాన్ని రద్దు చేసి, ఒక మండలంలో ఒకే స్మార్ట్ కిచెన్ ఏర్పాటు చేసి అక్కడి నుంచి వాహనాల ద్వారా భోజనం పంపిణీ చేయాలనుకోవడం గిరిజన ప్రాంతాల్లో విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తుందని అన్నారు. ఇప్పటి వరకు తక్కువ వేతనాలతో అప్పులు చేసుకుంటూ, ఆరోగ్యాన్ని పణంగా పెట్టి పిల్లలకు వేడి వేడి భోజనాలు అందిస్తున్న నిర్వాహకుల ఉపాధిని ఇలా కుదించివేయడం ప్రభుత్వం చేస్తున్న అన్యాయమన్నారు. కనీస వేతనాలు చెల్లించాల్సిన ప్రభుత్వం వాటిని ఇవ్వకపోగా ఇప్పుడు ఈ ఉపాధినే కోసేయడానికి సిద్ధపడడం దారుణమన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించి లక్షల్లో కమిషన్లు తీసుకొనే ప్రయత్నమే ఈ స్మార్ట్ కిచెన్ ప్రణాళిక అని విమర్శించారు. గిరిజన ప్రాంతాల్లో ఈ విధానం అమలైతే, పాఠశాలల్లో భోజనం అందక పిల్లలు ఆకలితో తిరిగే పరిస్థితి వస్తుందని, సీపర్లకు కనీస వేతనాలు చెల్లించడం, గుర్తింపు కార్డులు, పనిముట్లు అందించడం ప్రభుత్వ బాధ్యత అని గుర్తు చేశారు. ప్రైవేటీకరణను నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు తల్లిదండ్రులను ఐక్యం చేసి భారీ ఉద్యమాలు చేపడతామని అన్నారు. అనంతరం సంఘం నూతన కమిటీని ఎన్నుకుంది. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు మండింగి శ్రీనివాసరావు, కె.సీతారాం, మధ్యాహ్న భోజన నిర్వాహకులు త్రివేణి, గౌరమ్మ, బి.లక్ష్మి, శ్రీదేవి, కళమ్మ, గయ్యారమ్మ, చామంతి తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు, సిఐటియు నాయకులు

వందరోజుల ప్రణాళికతో 'పది'లో మెరుగైన ఉత్తీర్ణత

- అనారోగ్య విద్యార్థుల కోసం ప్రత్యేక యాప్
- సిఎస్‌ఆర్ నిధులతో మరుగుదొడ్ల మరమ్మతులు
- 'ప్రజాశక్తి'తో గిరిజన సంక్షేమ డిడి ఎ.విజయశాంతి ముఖాముఖి

ఐటిడిఎ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో, గురుకుల పాఠశాలల్లో పదోతరగతి పరీక్షల్లో ఈ ఏడాది కూడా మెరుగైన ఫలితాలు సాధించేందుకు వందరోజుల ప్రణాళికతో ముందుకు వెలుతున్నట్లు గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ ఎ.విజయశాంతి చెప్పారు. అలాగే సిఎస్‌ఆర్ నిధులతో జిల్లాలోని గిరిజనసంక్షేమ ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో మరమ్మతులకు గురైన మరుగుదొడ్లును బాగు చేస్తామన్నారు. అలాగే ఈ విద్యాసంస్థల్లో చేపట్టబోయే కార్యక్రమాలపై ఆమె ప్రజాశక్తి తో ముఖాముఖి మాట్లాడారు .
-ప్రజాశక్తి, పార్వతీపురం

➡ పదోతరగతిలో మెరుగైన ఫలితాల కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

వచ్చే ఏడాదిలో జరుగనున్న పదోతరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు వందరోజుల ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా చేసుకుని వారిని నాలుగు కేటగిరీలుగా విభజించి వెనుకబడిన సి,డి కేటగిరీ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించనున్నాం. సకాలంలో సిలబస్ పూర్తి చేసి పరీక్షలకు రివిజన్ చేసేలా చర్యలు చేపడుతున్నాం.

➡ ఎంతమంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలకు హాజరవుతారు?

ఐటిడిఎ పరిధిలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో పదోతరగతి పరీక్షలకు 25,540 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. 40 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు చెందిన 1860మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

➡ అనారోగ్య విద్యార్థులపై ఎటువంటి చర్యలు చేపడుతున్నారు?

గిరిజన సంక్షేమ ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల పరిస్థితిని అంచనా వేయడానికి హెచ్ పిటిఎస్ యాడ్‌ను వినియోగంలోకి తీసుకొచ్చాం. ఈ యాప్‌లో అనారోగ్యం ఉన్న విద్యార్థుల వివరాలు ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని ఆదేశించాం. పాఠశాల తరగతి గదులు, మరుగుదొడ్ల పరిశుభ్రతకు సంబంధించిన ఫొటోలు కూడా యాప్‌లో అప్ లోడ్ చేయాల్సి ఉంది .

➡ కురుపాం గురుకుల పాఠశాలలో మౌలిక సమస్యల్ని పరిష్కరించారా?

కురుపాం గురుకుల పాఠశాలలో మౌలిక సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాం. పాఠశాలలో రక్షిత మంచినీటి సరఫరా కోసం కొత్త ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేశాం. 40మరుగు దొడ్లు నిర్మించాం. అసంపూర్తి భవనం నిర్మాణాన్ని పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాం. విద్యార్థినుల హాజరు క్రమేణా పెరుగుతూ వచ్చింది.

➡ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో మౌలిక సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు చేపట్టారు?

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో, గురుకుల పాఠశాలల్లో పాడైన వాటర్ ప్లాంట్లు, మరుగుదొడ్ల మరమ్మతు పనుల కోసం రూ.50లక్షల సిఎస్ ఆర్ నిధులతో మరమ్మతు పనులు చేపడతాం.



➡ డిఎస్‌సి ద్వారా ఉపాధ్యాయులు నియామకం కావడంతో సిఆర్టీల భవిష్యత్తు గురించి ఏం చర్యలు?

డిఎస్‌సి ద్వారా ఐటిడిఎకు 132మంది ఉపాధ్యాయులను ప్రభుత్వం కేటాయించింది. వీరిలో 131 మంది ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. సిఆర్టీలందరినీ అన్ని పాఠశాలల్లో సర్దుబాటు చేయడానికి చర్యలు చేపడతున్నాం.

కంచె ఏర్పాటుపై సిపిఎం హర్షం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఎట్టకేలకు వరహాల గెడ్డ ఆక్రమణలు తొలగింపుపై ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న స్థల పరిరక్షణకు అధికారుల చర్యల పట్ల సిపిఎం సభ్యులు అభినందనలు తెలిపారు. వరహాల గెడ్డ ఆక్రమణలపై వామపక్ష ప్రజాసంఘాల ఆందోళన, ఆక్రమణదారులు వేసిన కంచెను ప్రజాసంఘాల నాయకులు తొలగింపు నేపథ్యంలో సబ్ కలెక్టర్ స్పందించి వరహాలగెడ్డలో కొంత భాగం ఆక్రమణలు తొలగించి, ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న స్థలం పరిరక్షణకు శాశ్వత కంచె ఏర్పాటుకు చర్యలు చేపట్టడం పట్ల సిపిఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ, నాయకులు బివి రమణ, బి.సూరిబాబు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం వరహాల గెడ్డ ఆక్రమణల నేపథ్యంలో ప్రభుత్వం స్వాధీనం చేసుకొని మున్సిపల్ అధికారులు వేస్తున్న కంచె నిర్మాణ పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇదే విధంగా పార్వతీపురం పట్టణంలో ప్రభుత్వ ఆస్తులు, చెరువులు, స్థలాల పరిరక్షణకు నిర్దిష్టమైన చర్యలు చేపట్టాలని, అక్రమ రిజిస్ట్రేషన్ల నివారణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంగా మారిన తర్వాత అక్రమార్కులు ప్రభుత్వ స్థలాలు ఆక్రమించడంతో మౌలికవసతులు, పార్కింగ్, ట్రాఫిక్ సమస్యలు కూడా పట్టణంలో పెరిగాయని ఈ సమస్యల పరిష్కారానికి కూడా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ధోనుబాయిలో సంకల్పం

ప్రజాశక్తి - ధోనుబాయి

మండలంలోని ధోనుబాయి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ధోనుబాయిలో ఆదివారం ఎస్సై షేక్ మస్తాన్ ఆధ్వర్యంలో సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. సంకల్పం కాన్సెప్ట్‌పై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు గురించి వివరించారు. గంజాయి గుట్కా వంటి మత్తు పదర్థాలకు యువత దూరంగా ఉండాలన్నారు. మహిళా చట్టాలు గురించి అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపరాదన్నారు ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని కోరారు మితిమీరి వేగం వే ల్లరాదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి అన్నారు. కార్యక్రమంలో ఎఎస్ఐ త్రినాధరావు, సురేష్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న సర్పంచ్ రవీంద్ర

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

ప్రజాశక్తి -గరుగుబిల్లి

పర్యావరణాన్ని పరిరక్షించేందుకు పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని మండలంలోని సుంకి గ్రామ పంచాయతీ సర్పంచ్ కరణం రవీంద్ర అన్నారు. డాక్టర్ వైయస్సార్ విశ్వవిద్యాలయం, ఉద్యాన కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆ గ్రామంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అనంతరం గ్రామపరిసరాలు పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ వి.దీప్తి, అధ్యాపకులు ఆర్.పూర్ణ చైతన్య, ఎస్ ఝాన్సీరాణి, ఎం.మారుతి, ఎం.శంకర్, బి.సురేష్, ఎం.భూషణ్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం స్థానిక ఎస్ఐ పి.నారాయణరావు ప్రజలకు పౌర హక్కులు, చట్టపరమైన బాధ్యతలు, పోలీసు ప్రజల సహకారం గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాన్ని అర్థం చేసుకోవడం, ఎలాంటి సమస్యలు ఎదురైనా పోలీసులకు భయపడకుండా సంప్రదించాలని సూచించారు. ప్రజలు చట్టపరంగా తమ హక్కులను తెలుసుకుని ఉపయోగించుకోవాలని, సామాజిక శాంతి కోసం అంతా కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యుటిఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - భామిని

మండల యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. భామినిలో యుటిఎఫ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షులుగా టి.రమణ రావు, అధ్యక్షులుగా ఈగల తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శిగా కడ్రక ప్రసాదరావు, సహాధ్యక్షులుగా అప్పన్న, మహిళా సహాధ్యక్షురాలిగా రజిని, కోశాధికారిగా బి.మహేష్ ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకుడిగా సిద్దు వ్యవహరించారు.

కృష్ణారావు సేవలు ఆదర్శం

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించిన పి.కృష్ణారావు పోలీసు శాఖకు చేసిన సేవలు ఆదర్శనీయమని పాలకొండ డిఎస్‌పి ఎం.రాంబాబు అన్నారు. కృష్ణారావు ఆదివారం ఉద్యోగ విరమణ అయిన సందర్భంగా జరిగిన సన్మాన కార్యక్రమంలో డిఎస్‌పి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు, ఉద్యోగ విరమణ సహజమని, అయితే వారు పనిచేసిన సమయంలో మంచి సేవలందించి ప్రజల మన్ననలు పొందితే ఆ ఉద్యోగానికి సార్థకత ఉంటుందన్నారు. అలాంటి సేవలనే కృష్ణారావు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై జి కళాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి - సీతానగరం

పార్వతీపురం మండలం సూడిగాం గ్రామానికి చెందిన అయ్యప్ప స్వాములు ప్రైవేట్ బస్సులో దర్శనానికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా సీతానగరం మండలం లచ్చయ్యపేట వద్ద పార్వతీపురం నుంచి బొబ్బిలి వైపు వెళ్తున్న డిసిఎం వ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంఘటనపై స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తుంది. అయితే వ్యాన్ డ్రైవర్ మద్యం తాగి ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు.

అనాథ బాలికకు బంగారు చెవిదిద్దులు వితరణ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

తల్లిదండ్రులు చనిపోయి అనాధగా మారిన బాలికకు బంగారు చెవి ఇచ్చి ఆమె మనసు బంగారమని నిరూపించుకున్నారు పట్టణానికి చెందిన ఓ మహిళ. ఎవరైనా అనాధలకు అన్నదానమో, వస్త్ర దానమో చేయడం సహజం. కానీ అనాథ బాలికకు బంగారు చెవి దిద్దులు దానం చేసి ఉదారతను చాటుకున్నారు పట్టణంలోని పార్వతీనగర్ వీధికి చెందిన జరజాపు ఇందుమతి శ్రీనివాసరావు దంపతులు. తనకు కలిగిన దానిలో ఎంతోకొంత అనాధలకు సాయం చేయాలనే మనస్తత్వం కలిగి తమకు చేతనైనంత వరకు పలువురు అనాధలు, అభాగ్యులకు సహాయ సహకారాలు అందిస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం పార్వతీపురంలోని ఓ షెల్టర్ హెూమ్ లో ఉంటున్న తల్లిదండ్రులు లేని మీసాల సాయి కీర్తన అనే అనాధ బాలికకు బంగారు చెవి ఆభరణాలు వితరణ చేశారు. అనాధ బాలిక సాయి కీర్తనతో పాటు ఆమె సోదరి ఉషశ్రీకి కొత్త బట్టలు అందజేస్తూ బాగా చదువుకోవాలని, ఏ అవసరం వచ్చినా తమను సంప్రదించాలని కోరారు. అనాధ బాలికకు బంగారు చెవి ఆభరణాలు దానం చేసిన ఇందుమతి దంపతులను పలువురు అభినందించారు.

అనాథ చిన్నారికి చెవిదిద్దులు పెడుతున్న ఇందుమతి

గురజాడ స్ఫూర్తితో మహిళా సమస్యలపై ఉద్యమించాలి : ఐద్వా

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మహాకవి, సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు స్ఫూర్తిత మహిళా సమస్యలపై ఉద్యమించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి బి.లక్ష్మి పిలుపునిచ్చారు. గురజాడ వర్ధంతి సభ ఆదివారం స్థానిక వివేకానంద కాలనీలో ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ మహాకవి గురజాడ అప్పారావు మహిళా సమస్యలపై, సామాజిక రుగ్మతలపై అలుపెరగని సామాజిక ఉద్యమాల్ని నిర్వహించారని కొనియాడారు. వరకట్న వేధింపులు, సతీసహగమనం కన్యాశుల్కం, బాలికా విద్య వంటి సామాజిక సమస్యలపై ప్రజల్లో అలుపెరగని చైతన్యం కలిగించారని, ఆ మహానుభావుడి త్యాగ ఫలితంగానే ఈరోజు మహిళలకు కొన్ని హక్కులైన సాధించబడ్డాయని తెలిపారు. అంతటి మహెూన్నత వ్యక్తిత్వం కలిగిన గురజాడ అప్పారావు మన ప్రాంతానికి చెందినవారు కావడం ఆనందదాయకమని అన్నారు. గురజాడ అప్పారావు స్ఫూర్తితో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు నిర్వహించాలని, సాంఘిక చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని మహిళలకు పిలుపునిచ్చారు. వందేళ్ల క్రితం గురజాడ అప్పారావు ఏ సమస్యల కోసమైతే చైతన్యం కలిగించారో అవే సమస్యలు నేటికీ కొనసాగడం విచారకరమని, ప్రభుత్వాలు కూడా సామాజిక, మహిళా సమస్యల పరిష్కారానికి చిత్త శుద్ధితో వ్యవహరించాలని, బాల బాలికల హక్కులను కాపాడేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా ఉపాధ్యక్షులు ఎం.గౌరమ్మ, జి.తులసి, మంగ, బి జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సాలూరు: మహాకవి, సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు వర్ధంతి సభ ఆదివారం సన్యాసి రాజుపేటలో ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా మండల నాయకులు ఆరిక నారాయణమ్మ, శశికళ, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు గౌరీశ్వరి మాట్లాడుతూ మహాకవి గురజాడ అప్పారావు వరకట్న వేధింపులు, కన్యాశుల్కం, బాలికా విద్య వంటి సామాజిక సమస్యలపై ప్రజల్లో చైతన్యం కలిగించారన్నారు. గురజాడ స్ఫూర్తితో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు నిర్వహించాలని, సాంఘిక చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని మహిళలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా, శ్రామిక మహిళా నాయకులు పుష్ప, మరియమ్మ, సుశీల, యుటిఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు కోలక లీల తదితరులు పాల్గొన్నారు.

గురజాడకు నివాళ్లు అర్పిస్తున్న ఐద్వా జిల్లా కార్యదర్శి లక్ష్మి, నాయకులు

మెమొంటోలు అందుకున్న విద్యార్థులు

నవోదయ మోడల్ టెస్ట్‌కు స్పందన

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక శ్రీ గాయత్రీ స్కూల్ అండ్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన నవోదయ మెగా మోడల్ టెస్టుకు 224 మంది విద్యార్థులు హాజరైనట్లు కరస్పాండెంట్ ఎస్.లోకేష్ తెలిపారు. మెగా మోడల్ టెస్టులో ప్రథమ స్థానం ఎల్ఎన్‌పేట ఎంపిపి పాఠశాలకు చెందిన ఎం.వేదర్శిని రూ.5వేలు, ద్వితీయ స్థానం సంతకవిటి శ్రీసంతోషి స్కూల్ కి చెందిన శ్రీపాన జ్ఞాన దీక్షిత రూ.3వేలు, తృతీయ స్థానం చీపురుపల్లి ఎంపిపి స్కూల్‌కు చెందిన జె.అఖిల్‌కు 2వేలు చొప్పున బహుమతులు ప్రదానం చేసినట్లు కస్పాండెంట్ తెలిపారు. అలాగే 20 ర్యాంకులు సాధించిన విద్యార్థులకు షీల్డ్ చేసినట్లు ఆయన తెలిపారు. వివిధ మండలాల నుంచి మెగా మోడల్ టెస్ట్‌కు హాజరైన విద్యార్థులకు నిర్వాహకులు భోజన సదుపాయం కల్పించారు. మెగా మోడల్ టెస్ట్ వల్ల విశేషస్పందన లభించిందని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బందితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

బాధితురాలికి న్యాయం జరిగే వరకూ అండగా ఉంటాం

మాజీ డిప్యూటీ సిఎం పుష్పశ్రీవాణి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఓ మహిళా ప్రభుత్వ ఉద్యోగినిని లైంగిక వేధింపులకు గురి చేసిన మంత్రి సంధ్యారాణి అనాధికారి పిఎ సతీష్‌ను వెంటనే అరెస్టు చేసి, బాధిత మహిళకు న్యాయం చేయాలని మాజీ డిప్యూటీ సిఎం పాముల పుష్పశ్రీవాణి డిమాండ్ చేశారు. జియమ్మవలస మండలం చినమేరంగి కోటలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. శనివారం మంత్రి సంధ్యారాణి ప్రెస్‌మీట్ చూస్తే లైంగిక వేధింపులకు, అత్యాచారానికి గురైన బాధిత మహిళకు అండగా ఉండకుండా నిందితుడికి మద్దతు తెలపడం ఎంతవరకు సమంజసమని పుష్ప శ్రీవాణి ప్రశ్నించారు. ఈ సంఘటనకు మంత్రి బాధ్యత వహిస్తూ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బాధిత మహిళా ఉద్యోగికి న్యాయం జరిగే వరకు వైసిపి అండగా ఉంటుందని స్పష్టం చేశారు. కేసును తారుమారు చేయకుండా నిష్పక్ష పాతంగా పోలీసులు విచారణ చేపట్టి కేసు నమోదు చేయాలని అన్నారు. పోలీసులు విచారణ పూర్తి కాకుండా వాయిస్, వాట్సాప్ చాటింగ్ మార్ఫింగ్ అని మంత్రి ఎలా చెప్తారని పుష్ప శ్రీవాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఎంఒ నుంచి పిఎను తొలగించాలని ఆదేశాలు వచ్చిన తర్వాతే పిఎను తొలగించడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. మంత్రి ప్రెస్‌మీట్ పెట్టి సెంటిమెంట్‌గా రాజకీయ విమర్శలు చేసేరా తప్ప బాధిత మహిళకు న్యాయం చేయలేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిపై లేనిపోని విమర్శలు చేయడం అన్యాయమన్నారు. బాధిత మహిళ ముందుగా మంత్రి వద్దకు వచ్చి ఫిర్యాదు ఇచ్చినా పట్టించుకోకుండా నిందితుడు సతీష్‌కు వత్తాసు పలకడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. బాధిత మహిళకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని చెప్పారు.

సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్నమంత్రి సంధ్యారాణి

రాజకీయంగా ఎదుర్కోలేక ఆరోపణలు : మంత్రి

ప్రజాశక్తి - పాచిపెంట

రాజకీయంగా తనను ఎదుర్కోలేకే తనపై, తన కుటుంబ సభ్యులపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ మంత్రి గుమ్మడి సంధ్యారాణి మండిపడ్డారు. మండలంలోని పి.కోనవలసలో రూ.24 లక్షలతో నిర్మించిన రైతు సేవా కేంద్రం, రూ.35 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాలను మంత్రి ఆదివారం ప్రారంభించారు అనంతరం రైతన్న మీకోసం వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో అన్నదాత సుఖీభవ పథకం ద్వారా 67 లక్షల మంది రైతులు లబ్ధి పొందారని, సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు అందిస్తున్నామని అన్నారు. అలాగే ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో రైతు ఖాతాలో డబ్బులు జమ చేస్తున్న ఘనత టిడిపి ప్రభుత్వానిదేనన్నారు. రైతు పండించిన ప్రతి పంటను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పశుసంపదతోనే సంపూర్ణ ఆరోగ్యం, భూసారం పెరుగుతుందన్నారు. మితిమీరిన ఎరువులు వాడకంతో భూసారం తగ్గుతుందని, అతిగా ఎరువులతో పండించిన పంటల వల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ ముఖీ సూర్యనారాయణ, పాచిపెంట, మక్కువ, సాలూరు పట్టణ, మండల టిడిపి అధ్యక్షులు గూడెపు యుగంధర్, గుల్ల వేణుగోపాలరావు, నిమ్మాది తిరుపతిరావు, ఆముదాల పరమేష్, ఎఒ తిరుపతిరావు, తహశీల్దార్ డి.రవి, ఎంపిడిఒ బివిజె పాత్రో, పలు శాఖల అధికారులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

ఆ వివాదం మంత్రి స్వయంకృతాపరాధం

మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి మాజీ పిఎ సతీష్, ఆమె కుమారుడిపై లైంగిక వేధింపులకు సంబంధించిన ఆరోపణలు రావడానికి కారణం ఆమె స్వయంకృతాపరాధమేనని మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర అన్నారు. ఆదివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ వ్యవహారంలో వైసిపి నాయకుల ప్రమేయం ఉందని మాజీ పిఎ సతీష్, మంత్రి సంధ్యారాణి ఆరోపించడం అర్థరహితమని చెప్పారు. ఒంటరి మహిళా ఉద్యోగి తన సమస్యను చెప్పుకోడానికి వచ్చినప్పుడు ఇరువర్గాలతో చర్చించి సమస్యను పరిష్కరించి ఉంటే పరిస్థితి ఇంతవరకు వచ్చేది కాదన్నారు. ఒంటరి మహిళ నియామకమై రెండేళ్లు కాకముందే గుమ్మలక్ష్మీపురం వైపు బదిలీ చేయాల్సిన అవసరం ఎందుకొచ్చిందని ప్రశ్నించారు. పిఎ సతీష్‌పై పలు ఆరోపణలు చేస్తూ ఒంటరి పోలీసులకు ఫిర్యాదు చేసిందని, ఆ తర్వాత పిఎ సతీష్ కూడా పోలీసులకు పిర్యాదు చేశారని చెప్పారు. కావున పోలీసులు నిష్పక్షిక విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సిఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నియోజకవర్గంలో ఏం జరుగుతుందో, ఎలాంటి పరిస్థితులు నెలకొన్నాయో విచారణ జరిపించాలని కోరారు. గడచిన ఏడాదిన్నర కాలం లో మంత్రిగా సంధ్యారాణి ఎంత చిరుద్యోగులను ఉద్యోగాల నుంచి తొలగించారో, ఎంతమంది ని కక్షపూరితంగా బదిలీ చేయించారో నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసునన్నారు. సమావేశంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు వంగపండు అప్పలనాయుడు, ప్రచార విభాగం జిల్లా కన్వీనర్ గిరిరఘు, వైసిపి సీనియర్ నాయకులు గొర్లి మాధవరావు, ఎంఎస్ నారాయణ, కాకి పాండురంగ, పిరిడి రామకష్ణ, కె.వెంకటరమణ, ఎం.అప్పారావు పాల్గొన్నారు.

వంతెనపై కూరుకుపోయిన ట్రాక్టర్

ప్రజాశక్తి - మక్కువ

మండలం లోని మార్కొండ పుట్టి సమీపంలో చిట్టిగెడ్డ వంతెనపై ఆదివారం ట్రాక్టర్ కూరుకుపోయింది. మండలంలోని ఎర్రసామంతువలస నుండి తుండ ఇటుకులోడుతో ట్రాక్టర్ వెళ్తుంది. ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న వంతెన ప్రమాదకరంగా మారింది. దీంతో రాక పోకలకు ఇబ్బంది పడుతూనే ఏజెన్సీ ప్రాంతాలకు వెళ్లే ప్రజలు అవస్థలు పడుతున్నారు. పొరపాటున ట్రాక్టర్ బోల్తా పడి ఉంటే పెనుప్రమాదం సంభవించేదనే స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

వంతెనలో కూరుకుపోయిన ట్రాక్టర్

పార్కులో సండే సందడి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్క్‌కు ఆదివారం సెలవు దినం కావడంతో పర్యాటకులు తరలివచ్చారు. పార్కులో ఉన్న అందాలను ఆశ్వాదించారు. ఆనంద విహార్ వద్ద పర్యాటకులు, యువకులు నృత్యాలతో సందడి చేశారు. జలవిహార వద్ద బోటు షికార్ చేశారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో విహరించారు. హ్యాంగింగ్ బ్రిడ్జిపై యువతీ యువకులు నడిచి వెళ్లారు. చిన్నారులు కమాండో నెట్ ఎక్కి ఆడుకున్నారు

పార్క్‌లో సందడి చేస్తున్న పర్యాటకులు

సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

రైతన్న సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం : ప్రభుత్వ విప్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రైతన్న సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, మాజీ ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. జియ్యమ్మవలస మండలం కెటి వాడలో మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా రైతుల స్థితిగతులు మార్చేలా కూటమి ప్రభుత్వం పంచ సూత్రాలైన నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం నుంచి మద్దతు అనేవి రూపొందించింది అన్నారు. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసి రైతును ఆర్థికంగా బలోపేతం చేయడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని, అందుకోసమే పంచ సూత్రాలతో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతుందని అన్నారు. అనంతరం స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి రైతన్న మీకోసం కరపత్రాలను పంపిణీ చేసి రైతుల కోసం చేపడుతున్న కార్యక్రమాలు, రాబోయే రోజుల్లో చేయబోయే అంశాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి దత్తి లక్ష్మణరావు, అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, మండల కన్వీనర్ జోగి భుంజగరావు, పిఎసిఎస్ చైర్మన్ సోములు మాష్టారు, వట్టిగెడ్డ ప్రాజెక్ట్ చైర్మన్ సత్యం నాయుడు, వైస్ చైర్మన్ ప్రసాద్, మాజీ కన్వీనర్ పల్లా రాంబాబు, జనసేన నాయకులు శ్రీరామ్, వ్యవసాయ శాఖ, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజం మనందరి బాధ్యత

ప్రజాశక్తి - పార్వతీపురం

హెచ్ఐవి, ఎయిడ్స్ రహిత సమాజం మనందరి బాధ్యత అని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు పేర్కొన్నారు. డిసెంబర్ 1న ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా పలు సూచనలు చేశారు. హెచ్ఐవిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, సమగ్ర అవగాహనతోనే ఎయిడ్స్ నిర్మూలన సాధ్యమని పేర్కొన్నారు. హెచ్ఐవి వ్యాధిగ్రస్తుల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుందని, అయితే ప్రభుత్వ యంత్రాంగం ద్వారా ఉచితంగా అందజేస్తున్న ఎఆర్‌టి మందులతో ఆరోగ్యం, జీవన ప్రమాణాలు మెరుగు పడుతున్నాయని, వాటితో పాటు పోషకాహారం సక్రమంగా తీసుకోవాలన్నారు. జిల్లాలో ఒక ఎఆర్‌టి కేంద్రం, మూడు లింక్ ఎఆర్‌టి కేంద్రాల ద్వారా హెచ్ఐవి వ్యాధిగ్రస్తులకు మందులు అందజేయడం, ఆరోగ్య పర్యవేక్షణ, కౌన్సిలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అవగాహన ర్యాలీ, సదస్సులు నిర్వహించి ఎయిడ్స్ రహిత సమాజం నిర్మాణమే ధ్యేయంగా అంతా భాగస్వాములు కావాలని కోరారు. ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారులు టి. జగన్ మోహనరావు, ఎం.వినోద్ కుమార్, పిఎల్ రఘు కుమార్ ఉన్నారు.

నేడు ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవంపై ర్యాలీ

గరుగుబిల్లి : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా గరుగుబిల్లిలో సోమవారం అవగాహన ర్యాలీతోపాటు మానవహారం కార్యక్రమం, సదస్సు నిర్వహించనున్నట్లు స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎన్ఎంకె తిరుమలప్రసాద్ వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణమే ధ్యేయంగా ఈ కార్యక్రమంలో అంతా భాగస్వామ్యులు కావాలని కోరారు. ఎయిడ్స్ రహిత సమాజం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. హెచ్ఐవిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, అదే విధంగా సమగ్ర అవగాహనతోనే ఎయిడ్స్ నిర్మూలన సాధ్యమనితిరుమలప్రసాద్ పేర్కొన్నారు.

నెలిపర్తి సర్పంచ్ మృతి

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని నెలిపర్తి సర్పంచ్ ఎద్దు వెంకటమ్మ (75) గుండెపోటుతో శనివారం రాత్రి తన నివాసంలో మరణించారు. సర్పంచ్ వెంకటమ్మ భౌతికాయాన్ని మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి దండి శ్రీనివాసరావు సందర్శించి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. అలాగు వైసిపి సోషల్ మీడియా కోర్డినేటర్‌గా వ్యవహరిస్తున్న వెంకటమ్మ కుమారుడు ఎద్దు వేణును ఓదార్చి, ధైర్యం చెప్పారు.

ఆశ్రమ పాఠశాలలో అవస్థలెన్నో

- మెనూ ఒకటి, భోజనం మరొకటి
- టిక్కబాయి హెచ్‌ఎం వార్డెన్లను వెంటనే సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని టిక్కబాయి గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలలో నెలకొన్న తీవ్ర అవ్యవస్థలను నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ నాయకత్వంలో విద్యార్థులు ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.అఖిల్, ఉపాధ్యక్షుడు హెచ్.సింహాచలం మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు కనీస మౌలిక వసతులు కూడా లేవని, భోజనం విషయంలో పరిస్థితి మరింత దయనీయంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం పూరీలు ఇవ్వాల్సిన చోట 'కిచిడి' పేరిట ముద్ద అన్నం, మధ్యాహ్నం చికెన్-బిరియానీ స్థానంలో అన్నం, గుడ్ల కూర, అది కూడా పూర్తిగా ముద్దగా ఉండడంతో విద్యార్థులు భోజనం చేయలేని పరిస్థితి నెలకొంటుందని పేర్కొన్నారు. ఈ విషయాలను విద్యార్థులు పలుమార్లు వార్డెన్‌కు తెలియజేసినా ఎలాంటి మార్పు కనిపించడంలేదు అని అన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తుపై నిర్లక్ష్యం వహించే హెచ్‌ఎం, వార్డెన్లను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కుల కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ధర్నాలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హాస్టల్‌లో వంటను పరిశీలిస్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అఖిల్

మండల పరిషత్ కార్యాలయంలో వేధిస్తున్న సిబ్బంది కొరత

ప్రజాశక్తి - కురుపాం

నియోజకవర్గ కేంద్రమైన కురుపాం మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది కొరతతో వేధిస్తుంది. ముఖ్య విభాగాల్లో పోస్టులు ఖాళీ కావడం, డిప్యూటేషన్లు పెరగడంతో ప్రజలకు సకాలంలో సేవలు అందడంలేదు. ప్రధానంగా ఉపాధి హామీ ఎపిఒ బదిలీపై వెళ్లిపోవడంతో ఆ పోస్టు ఇప్పటికీ ఖాళీగానే ఉంది. కీలక బాధ్యతలు ఇప్పటికీ ఖాళీగానే ఉన్నాయి. జూనియర్ అసిస్టెంట్ డిప్యూటేషన్‌పై వెళ్లడంతో మరో ప్రధాన పోస్టు ఖాళీ ఏర్పడింది, పంచాయతీరాజ్ జెఇ డిఇగా ఉద్యోగోన్నతిపై వెళ్లడంతో జియ్యమ్మవలస మండలం జెఇకి ఆ బాధ్యతలను అప్పగించినప్పటికీ ఆయన రెండు మండలాలకు న్యాయం చేయలేకపోతున్నారు. దీంతో సేవలు సక్రమంగా అందక పనులు నిలిచిపోయే స్థితి ఏర్పడింది. అదేవిధంగా నీలకంఠాపురం, పి.లేవిడి, టోంపలపాడు, జరడ తదితర గ్రామ సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వబ్బంగి, కిచ్చాడ పంచాయతీ కార్యదర్శులు డిప్యూటేషన్‌పై ఇతర చోట్ల విధులు నిర్వహించడంతో, అక్కడి ప్రజలు చిన్న చిన్న పనులకు కూడా పలుమార్లు కార్యాలయాల చుట్టు తిరగాల్సి వస్తోంది. సిబ్బంది కొరతతో మిగిలిన ఉద్యోగులపై పని భారం అమితంగా పెరిగి, పథకాలు, ధ్రువపత్రాలు జారీ, లబ్ధిదారుల వినతులన్నీ ఆలస్యమవుతున్నాయి. ప్రజల పనులు నిలకడగా సాగకుండా ఉండడంతో అసంతృప్తి వ్యక్తమవుతోంది. నియోజకవర్గ కేంద్రంలోనే పరిస్థితి ఇలా ఉండడం విచారకరం అని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖాళీ పోస్టులను తక్షణం భర్తీ చేసి ప్రజా సేవలు సజావుగా నడిచేలా ప్రజా ప్రతినిధులు, అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఎయిడ్స్‌పై మహిళలకు అవగాహన

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక వైటిసిలో మహిళలకు హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నీడ్ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ పి.వేణు గోపాల రావు మాట్లాడుతూ, హెచ్ఐవి, ఎయిడ్స్ పట్ల ప్రజల్లో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఒకరు వాడిన సూదులు, సిరంజిలను మరొకరు ఉపయోగించడం ద్వారా ఈ వ్యాధి సంక్రమించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అక్రమ సంబంధాల వల్ల కూడా ఎయిడ్స్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల సమాజంలో అంతా సమాన భావంతో చూడాలని, వారి పట్ల వివక్ష చూపకుండా మానవీయ కోణంలో ఆదరించాలని ఆయన కోరారు. ఇదివరకు ఎయిడ్స్ అంటే ప్రజల్లో తీవ్ర భయాందోళన ఉండేదని, అయితే ప్రస్తుతం మెరుగైన మందులు అందుబాటులోకి వచ్చాయని సరైన చికిత్స తీసుకుంటూ హెచ్ఐవి,ఎయిడ్స్‌తో బాధపడేవారు కూడా చాలా కాలం ధైర్యంగా, ఆరోగ్యంగా జీవించే అవకాశం ఉందని ఆయన స్పష్టం చేశారు.

అవగాహన కల్పిస్తున్న నీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్, సిబ్బంది

మల్లేశ్వరరావుకు గిరిజన సంఘాలు సన్మానం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఎస్‌టి కమిషన్ మెంబర్ కడ్రక మల్లేశ్వరరావును గిరిజన సంఘాల నాయకులు ఆదివారం సన్మానించారు. ఇటీవలే విజయవాడలో ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఆయన స్వగ్రామం గుణదలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నిమ్మక శేఖరం, పలు గిరిజన సంఘాల నాయకులురొబ్బా లోవరాజు, ఇంటికుప్పల రామకృష్ణారావు, మండంగి భూషణరావు, తాడంగి సత్యనారాయణ, డుమ్మంగి సర్పంచ్ పాలక క్రాంతికుమార్, నాయకులు తోయక నాగభూషణం, శంకరరావు మాస్టర్, పల్ల సురేష్, గిరిజన జెఎసి నాయకులు ఊయక తిరుపతిరావు, ఊర్లక మల్లయ్య, గిరిజన నాయకులు, జగ్గారావు, నీలిమ, కొండలరావు, రవి ఉన్నారు.